క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దుర్గ కుటుంబం

కాణిపాకం(యాదమరి): శ్రీశైలంకు చెందిన దుర్గ బుధవారం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆమె కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

బంగారుపాళెం: బంగారుపాళెం సబ్ ట్రెజరీ పరిధిలోని ప్రభుత్వ పెన్షన్‌దారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి నెలాఖరులోపు అందజేయాలని ఎస్టీవో హరిప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

పలమనేరు: పట్టణ సమీపంలోని చిన్నూరు చౌడేశ్వరి ఆలయంలో బుధవారం అగ్ని కుల క్షత్రియ సంఘం–2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు రవి,అగ్ని కుల క్షత్రియ సంఘ నాయకులు శ్రీనివాసన్, మునెప్ప, లక్ష్మయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. కులంలోని పేదలకు సంఘంలోని సభ్యులు ఏదేనీ సమస్యలున్నప్పుడు అండగా నిలుద్దామని నేతలు పిలుపునిచ్చారు.

ఎంజీఆర్‌కు నివాళి



ఎంజీఆర్‌కు నివాళులర్పిస్తున్న ఏఐఏడీఎంకే నాయకులు

నగరి: దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ 107వ జయంతిని బుధవారం నగరి మున్సిపల్ పరిధిలో ఏఐఏడీఎంకే ఆంధ్రరాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టెడ, సత్రవాడ, కేవీపీఆర్‌పేట ప్రాంతాల్లో ఎంజీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ బృందా కన్నాయిరం, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గ సెక్రటరీలు గోవిందస్వామి, పాండు, కేసీ షణ్ముగం, నాయకులు కైలాసం, బీఆర్వీ అయ్యప్పన్, నటరాజన్, మోహన్‌రాజ్, మనోహర్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్‌బాయ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా కనుమ పండుగ మరునాడు పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులను ఆలయం నుంచి రేణిగుంట రోడ్డులోని పార్వేట మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. అక్కడ ఆస్థానం నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించడానికి పార్వేట మండపానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తిరిగి నగర వీధుల్లో ఊరేగింపుగా ఉత్సవమూర్తులను సాయంత్రం 6.30 గంటలకు ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్‌ఓ బాలాజీ, బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.



ఆస్థానం నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు, అర్చక పండితులు

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



ఉద్యోగులను సన్మానిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి



రవాణాశాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న డీటీసీ బసిరెడ్డి

- ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దామని ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు–2 డిపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ మనుగడ ఉద్యోగులపై ఆధార పడి ఉందన్నారు. బస్సులు నడపడంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. నష్టాలను అధిగమించేందుక ప్రణాళిక ప్రకారం బస్సులను తిప్పాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల జరగకుండా జాగ్రత్త పడాలని, ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం ఆయన ఆదర్శ డ్రైవర్లను సన్మానించారు. ముందుగా డిపో గ్యారేజీని తనిఖీ చేశారు. జిల్లాలో ఆర్టీసీ సమస్యలు, ప్రమాణికుల ఇబ్బందులు, బస్టాండు నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, సీఐ అల్తాఫ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: డీటీసీ

చిత్తూరు రూరల్: రహదారిపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా రవాణశాఖ కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. రోడ్డు భద్రత విషయమై డీటీసీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. మానవ తప్పిదాలతోనే 90 శాతం ప్రమాదాలకు దారితీస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలిందన్నారు. మితిమీరిన వేగం, రోడ్డు నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నట్టు చెప్పారు. రహదారి మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనదారులు వాహనాలను నడపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ ఫిజీషియన్’తో ఇంటి వద్దకే వైద్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని బొమ్మసముద్రం వైద్యాధికారి వైద్యాధికారి అనూష అన్నారు. బుధవారం మండలంలోని పేయనపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మొత్తం 65 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని ఇళ్లకు వెళ్లి పరీక్షించారు. వైద్య సిబ్బంది అన్నపూర్ణ, రిజ్వానా, శిరీష, శివగామి, శశి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యాన మహా యజ్ఞం

తవణంపల్లె: మండలంలోని సిద్ధంపల్లె సమీపంలో ఉన్న విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో గురువారం నుంచి 24వ తేదీ వరకు ధ్యాన మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్టు జిల్లా గ్లోబల్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో సంగీత జ్ఞానం, మౌన జ్ఞానం, ఆత్మజ్ఞాన బోధన, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, ధ్యాన ప్రచారం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆనందమయ జీవితానికి మౌన ధ్యానం, ఆత్మజ్ఞాన బోధన ఎంతో అవసరమన్నారు. జిల్లాలోని ధ్యానులు ఉచిత ధ్యాన మహా యజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న మోహన్‌వేలు

తవణంపల్లె: పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లపురెడ్డిపల్లె, మత్యం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, ఏఎన్‌ఎం రోజా, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఆశా కార్యకర్తలు మెహర్, కల్పన పాల్గొన్నారు.

పూతలపట్టులో ఆర్యవైశ్యుల వనభోజనం



పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పూతలపట్టు: మండలంలోని ఆర్యవైశ్యులు బుధవారం వన భోజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. పూతలపట్టు జాతీయ రహదారి సమీపంలోని మామిడి తోపులో ఆర్యవైశ్యులు వారి కులదేవత కన్యకా పరమేశ్వరిని పూజించారు. ప్రతి సంవత్సరం కనుమ పండుగ మరుసటి రోజు దేవతలను కొలిచి వన భోజనం కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి, ధర్మకర్త మల్లికార్జున శెట్టి, మునిరాజగుప్త, సురేంద్రబాబు, ప్రత్యూష్, వాసు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానం చేయాలని సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేస్తున్న సంజీవి

చిత్తూరు రూరల్: పలు రాష్ట్రాల్లో నదుల అనుసంధానం చేయాలని కోరుతూ సైకిల్ యాత్ర చేస్తున్నట్టు తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా అమమయ్యరుకుప్పల గ్రామానికి చెందిన సంజీవి తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం అయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరు నుంచి తమిళనాడులోని సేలంకు సైకిల్‌యాత్ర ప్రారంభించారన్నారు. ఒక సత్సంకల్పంతో ఈ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని, ఈ దిశగా పాలకులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల21న సేలంలో నిర్వహించనున్న సదస్సుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ రానున్నారని, నదుల అనుసంధానం విషయాన్ని ఆయన దృష్టి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

జాబ్ మేళాలో 32 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

బంగారుపాళెం: స్థానిక విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించినట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 83 మంది నిరుద్యోగులు హాజరైనట్టు పేర్కొన్నారు. అందులో 32 మందికి జెనిసిస్, జెప్టోస్టోర్, డెకాథ్లాన్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకటాచలం, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు చైతన్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ జమీందారు మృతికి ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, పూతలపట్టు సమన్వయకర్త సునీల్‌కుమార్



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

బంగారుపాళెం: బంగారుపాళెం మాజీ జమీందారు ముద్దు బంగారు సుబ్బరామరాజా మృతి బాధాకరమని పలువురు సంతాపం వ్యక్తం చేశారు.. వారు బుధవారం సుబ్బరామరాజా భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, ఎంపీపీ అమరావతి, డీసీసీ మాజీ చైర్మన్ సుధాకర్ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం తనిఖీ



క్యాంపును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: ప్రభుత్వం ఆశయం మేరకు వైద్యులు బాధ్యతతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని డీఎంఅండ్‌హెచ్ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరులోని మాపాక్షిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్యసేవలపై ఆరా తీశారు. క్యాంపు వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు షణ్ముఖ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



పుష్పపల్లకిలో విహరిస్తున్న అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం గ్రామంలో వెలసిన ఎల్లమ్మకు కనుమ పండుగ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పపల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితులు ఉభయదారులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అమ్మవారిని పుష్పపల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పశువుల పండుగ

నడుం: మారుతివారిపల్లె గొల్లపల్లెలో పశువుల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. పశువులను అలంకరించి వీధుల్లో పరుగులు తీయించారు. వాటిని నిలువరించి వాటికి ఉన్న ఫలకలు దక్కించుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. ఇక, ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. సర్పంచ్ అనితాకుమారి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాటగంగమ్మకు పొంగళ్లు



మండలంలోని పాతురునత్తం గ్రామ మహిళలు బుధవారం బాటగంగమ్మకు పొంగళ్లు సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామం నుంచి ఊరేగింపుగా మహిళలు బాటగంగమ్మ ఆలయం వద్దకు వచ్చి పొంగళ్లు వండారు. వర్షాలు బాగా కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. –బైరెడ్డిపల్లె

గ్రామాల అభివృద్ధిలో అధికారులదే కీలకపాత్ర



మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి





తవణంపల్లె: మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దు కలాం ఆజాద్, హాజరైన అధికారులు

బంగారుపాళెం: గ్రామాల అభివృద్ధిలో అధికారులదే ముఖ్యపాత్రని ఎంపీపీ అమరావతి తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ), బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ), మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక(ఎంపీడీపీ)పై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడంపై వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి సదరు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాల్లో అవసరమైన పనులను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా నమోదు చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక తయారు చేసి సమర్పించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనపై అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, పంచాయతీల్లోని గ్రామాల సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా సమగ్ర ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, పీఆర్ ఏఈ గురువారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్, హౌసింగ్ ఏఈ శ్రీధర్, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఏపీఓ లలిత, ఈఓపీఆర్‌డి కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేడు, రేపు శిక్షణ

పూతలపట్టు: గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు గురు, శుక్రవారాల్లో శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో గౌరి తెలిపారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం వరకు ఉంటుందని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

108లో ప్రసవం



108లో సుజాతకు కాన్పు చేసి శిశువును అందజేస్తున్న టెక్నీషియన్

గుడిపాల: మండలంలోని చిత్తపారకు చెందిన గర్భిణి సుజాత (21) ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. మంగళవారం అర్ధరాత్రి ఆమెకు పురుటి నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. 108 వాహనంలో ఆమెను తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో గుడిపాల వద్ద నొప్పులు తీవ్రమయ్యాయి. ఇది గమనించిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివ 108 వాహనంలోనే ఆమెకు సురక్షిత ప్రసవం చేశారు. బుధవారం తెల్లవారుజామున ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం గుడిపాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారు.

‘అనారోగ్యంతో మృతి..ధర్నాలో పాల్గొని కాదు’

చిత్తూరు అగ్రికల్చర్: విజయా డెయిరీ మాజీ కార్మికుడు ఈశ్వర్ మొదలి (70) అనారోగ్యంతో మృతి చెందినట్లు బుధవారం ఆ డెయిరీ కార్మిక సంఘ నాయకుడు కుమార్ స్పష్టం చేశారు. వృద్ధాప్య సమస్యలతో అనారోగ్యం బారిన పదేళ్లుగా ఆయన చికిత్స పొందుతున్నారన్నారు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో వారం క్రితం మృతి చెందారన్నారు. అయితే సోషల్ మీడియాలో అతను కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొని మృతి చెందాడని, కార్మికుడు మృతి చెందినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ తన పేరిట చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఖండించారు. శంకర్ మొదలి కార్మికుల దీక్షలో పాల్గొనలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని నమ్మరాదని విజ్ఞప్తి చేశారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో గౌరి

పూతలపట్టు: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా బుధవారం పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత, బైటపల్లి, పోలవరం పాఠశాలల్లోని క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా 3 రోజులు సెలవు రావడంతో బుధవారం క్రికెట్ మ్యాచ్‌ను ఎంపీడీవో గౌరి ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఆడుతున్న క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ఆడడానికి ప్రయత్నించాలని సూచించారు. క్రీడా పోటీల ద్వారా సత్సంబంధాలు పెరగాలని, గొడవలకు దిగరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచులు మాసిలామణి, మణి, రామతులసీ, నాయకులు నిరంజన్‌రెడ్డి, బాలాజీ, పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి పాల్గొన్నారు.

కపిలతీర్థంలో కారిడార్ ఏర్పాటు చేయండి

తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో శాశ్వత పురోహితం నిర్వహణ కోసం కారిడార్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని శ్రీకపిలతీర్థం పురోహిత సేవా సంఘం గౌరవ సలహాదారుడు సంస్కార్ రాజేష్, అధ్యక్షుడు ఎ.అనిల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న కపిలతీర్థంలో పితృతర్పణ కార్యక్రమం నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేక షెడ్లు వేసి అవసరమైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. దీనికి సహకరించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఫారెస్ట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కపిలతీర్థం వేదికగా పురోహితమే జీవనంగా సుమారు 200 మంది బతుకుతున్నట్లు చెప్పారు.

పట్టు రైతుల ఆందోళన



పలమనేరులో ఆందోళన చేస్తున్న పట్టురైతులు, రీలర్లు

- బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- ఇప్పటికే కొంతవరకు విడుదలయ్యాయన్న అధికారులు

పలమనేరు: పలమనేరు ప్రాంతానికి చెందిన పట్టు రైతులు, రీలర్లు పెండింగ్‌లోని పట్టుగూళ్ల ఇన్సెంటివ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద ఆందోళన చేశారు. రైతులు ఏడూరు గురుమూర్తి, మరికొందరు మాట్లాడారు. తమకు 2019 నుంచి కేంద్ర పట్టుపరిశ్రమశాల కిలో పట్టుగూళ్లకు రైతుకు ప్రోత్సాహంగా ఇచ్చే రూ.50లను సక్రమంగా ఇవ్వడం లేదని, ఇప్పటివరకూ పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌లోనే రూ.13 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయని నిరసన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక ఏడీ కిశోర్ నాయక్‌ను వివరణ కోరగా..ఇటీవలే కొంత మేరకు బకాయిలు విడుదలై రైతుల ఖాతాల్లోకి జమ అయ్యాయన్నారు. కొంత నిధులు సీఎఫ్‌ఎంఎస్‌లో సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు.